క్లుప్తంగా

విద్యాశాఖ డైరెక్టర్‌కు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు చెబుతున్న పీఆర్టీయూ నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్):/ప్రశాంత్‌నగర్(సిద్ది పేట):

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జగదేవపూర్ గ్రామానికి చెందిన నరసింహారెడ్డి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో పీఆర్టీయూ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ తెలిపారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూలరవీందర్ ఉన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేత భగవాన్

దుబ్బాక: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు గడ్డం భగవాన్ ఆ పార్టీని వీడి మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చాలా బలోపేతం అవుతుందన్నారు. చెరుకు శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, కాంగ్రెస్ నాయకులు బోయ యాదగిరి, తునికి సురేష్, మల్లుగారి చంద్రారెడ్డి, గోపి, కనకయ్య తదితరులు ఉన్నారు.

పదవులుకాదు ప్రజాదరణే శాశ్వతం

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



ఎంపీటీసీలను సన్మానిస్తున్న బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): రాజకీయ నాయకులకు పదవులు శాశ్వతం కాదని ప్రజాదరణ ముఖ్యమని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని గుండారంలో శుక్రవారం మాజీ ఎంపీపీ లింగాల నిర్మలతో పాటు బెజ్జంకి మండల పరిషత్ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం ముందున్నవారిని ప్రజలు తప్పక గుర్తిస్తారన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు పాకాల మహిపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మహేందర్‌రెడ్డి, లక్ష్మి, లత, మల్లేశం, శారద, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ భవనానికి స్థలం కేటాయించండి



వినతి పత్రం ఇస్తున్న బీసీ సంఘ నాయకులు

హుస్నాబాద్: పల్లె ప్రకృతి వనం సమీపంలో బీసీ భవన్, బీసీ ఫంక్షన్ హాల్, బీసీ స్టడీ సర్కిల్ కోసం రెండు ఎకరాల అసైన్డ్ భూమి, రూ.5 కోట్లు కేటాయించాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీసీ సంఘం నాయకులు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. బీసీ సామాజిక వర్గంలో మధ్య, కింది తరగతుల వారికి ఉద్యోగ పోటీ పరీక్షలకు కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. గౌడ కమ్యూనిటీ హాల్‌కు పది గుంటల భూమి, రూ.20 లక్షలు కేటాయించాలని కోరారు.

ఉచిత రేబీస్ నివారణ టీకాలు

బెజ్జంకి(సిద్దిపేట): అంతర్జాతీయ జూనోసిస్ డే పురస్కరించుకుని శనివారం పశువైద్య శాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబీస్ వ్యాధి నివారణ టీకా వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పెంపుడు కుక్కలకు టీకా వేయించాలన్నారు.

పునరావాస కాలనీలో వసతులు

- మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి ఎఫెక్ట్..

అక్కన్నపేట(హుస్నాబాద్): జూన్ 19వ తేదీన భూములిచ్చాం...బాధపడుతున్నాం, పునరావాస కాలనీలో సౌకర్యాలు కరువు శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి స్పందించారు. శుక్రవారం అక్కన్నపేట మండలం నందారం స్టేజి వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కాలనీని సందర్శించారు. కాలనీ సమస్యలను భూ నిర్వాసితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పునరావాస కాలనీలో సదుపాయాలు కల్పిస్తామన్నారు. అలాగే తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కాలనీలో మరొక ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించాలన్నారు. విద్యుత్ సరఫరా, ఇళ్ల పట్టాలు, ఆర్టీసీ బస్సు సౌకర్యం, పాఠశాల భవన నిర్మాణం తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పత్తి పొలంలో పనులు చేస్తున్న మహిళా రైతులతో మంత్రి కొద్దిసేపు ముచ్చటించారు.



పునరావాస కాలనీవాసులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సర్వేకు ఆదేశం

ప్రాజెక్టు నిర్మాణంలో భూములతో పాటు సర్వస్వం కోల్పోయామని, ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న తమకు పట్టాలు ఇప్పించాలని భూ నిర్వాసితులు కోరారు. ఆయన స్పందించి భూ నిర్వాసిత కుటుంబాలెన్ని, ప్రభుత్వ భూములను ఎంత మంది, ఎన్ని ఎకరాల్లో సాగు చేసుకుంటున్నారో సర్వే చేయాలని ఆర్డీఓ, తహసీల్దార్‌ను ఆదేశించారు. భూ సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ రామ్మూర్తితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వనమహోత్సవం



గజ్వేల్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం ఆదేశించిన లక్ష్యం మేరకు అన్ని గ్రామాల్లో మొక్కలు నాటాలని ఎంపీడీఓ వేణుగోపాల్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటారు.

నాటిన ప్రతి మొక్కను కాపాడాలి

కొమురవెల్లి(సిద్దిపేట): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా నాటిన మొక్కలను కాపాడాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఏపీడీ సతీశ్ కుమార్ అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ అధికారులు, విద్యార్థులు, ఎంపీడీఓ కుమారస్వామితో కలసి ఏపీడీ గౌరయపల్లి, మర్రిముచ్చాల గ్రామాలలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడారు. వన మహోత్సవంలో నాటిన మొక్కలను కాపాడాలని గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

వర్గల్(గజ్వేల్): ఉద్యమస్ఫూర్తితో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు బాసటగా నిలుద్దామని వర్గల్ ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వన మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మండల వ్యాప్తంగా ఇన్‌స్టిట్యూషనల్ ప్లాంటేషన్, హరితవనాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రత్యేకాధికారులు, ఉపాధ్యాయులు, ఉపాధి, ఐకేపీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్‌లో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రారంభించారు. ఇటిక్యాలలో ఎంపీడీఓ యాదగిరి, జగదేవ్‌పూర్‌లో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు.

మానవ మనుగడకు..

దుబ్బాక: మానవాళి మనుగడలో చెట్లు కీలకమని మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత అన్నారు. శుక్రవారం ప్రభుత్వం చేపట్టిన 75వ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా దుబ్బాకలోని 14వ వార్డులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాల్టిలో 30 వేలకుపైగా మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు.

నర్సరీల ద్వారా..

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో ప్రజలు మొక్కలు నాటాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్క అనిల్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పొట్లపల్లి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. రైతులకు కావల్సిన మొక్కలను నర్సరీల ద్వారా ఫీల్డ్ అసిస్టెంట్లు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల నర్సింహారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం ఉద్యమస్ఫూర్తితో..

గజ్వేల్: మొక్కలు నాటే కార్యక్రమం ఉద్యమస్ఫూర్తితో జరగాలని, అలా జరిగినపుడే పర్యావరణ పరిరక్షణకు బాటలు పడతాయని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన వనమహోత్సవంలో మొక్కలు నాటారు.

కుడి చెరువు కట్టపై..

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక కుడి చెరువు కట్టపై మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి పాలకవర్గంతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు పర్యావరణ రక్షణతోపాటు ప్రాణవాయువు అందిస్తాయన్నారు.

తెలంగాణ మోడల్ స్కూల్‌లో..

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వన మహోత్సవంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఏపీడీ శివాజీ అన్నారు. మిరుదొడ్డిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆయన మొక్కలను నాటారు.

నారాయణరావుపేటలో..

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వజ్రోత్సవ వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నారాయణరావుపేట, సిద్దిపేటరూరల్ మండలాల పరిధిలోని గ్రామాల్లో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల ప్రత్యేక అధికారులు, మొక్కలు నాటారు.

మొక్కల సంరక్షణతో..

కొండపాక(గజ్వేల్): మొక్కలను నాటి సంరక్షిస్తే ఆరోగ్యంగా ఉంటామని అడిషనల్ డీఆర్‌డీఓ బాలకృష్ణ అన్నారు. మండలంలోని దుద్దెడలో శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మొక్కలను పరిరక్షించాలి

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో నాటిన మొక్కలను పరిరక్షించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి పిలుపునిచ్చారు. శుక్రవారం సిరిసిల్ల మార్గంలో మున్సిపల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వనమహోత్సవంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, పలువురు కౌన్సిలర్లు గైర్హాజరవడంతో చర్చనీయాంశంగా మారింది.

ఉమ్మడి మద్దూరు మండలంలో..

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఉమ్మడి మద్దూరు మండలంలో ప్రారంభించారు. మండల పరిధిలోని మద్దూరు, రేబర్తి, లద్నూర్ గ్రామాలలో మండల ప్రత్యేక అధికారి రాధిక, ధూళ్మిట్ట మండల పరిధిలో జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మీసాగర్, మాజీ ఎంపీటీసీ చెట్కూరి కల్యాణి, మొక్కలు నాటారు.

పారిశుద్ధ్య కార్మికుల భిక్షాటన



తిగుల్‌లో భిక్షాటన చేస్తున్న కార్మికులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని తిగుల్ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి తిరిగి భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమకు రెండు నెలల నుంచి వేతనాలు ఇవ్వడంలేదని వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి వేతనాలను అందించాలని కోరారు.


పరిశుభ్రతతో వ్యాధులు దూరం



వర్గల్‌లో నిల్వనీటిని తొలగిస్తున్న వైద్యసిబ్బంది

వర్గల్(గజ్వేల్): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో అనేక వ్యాధులకు అడ్డుకట్ట పడుతుందని వైద్యారోగ్య సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా వర్గల్‌లో ఇళ్లలోని నిల్వ నీటిని తొలగింపజేశారు. నిల్వ నీటిలో దోమలు తదితర వ్యాధికారక సూక్ష్మ జీవులు వృద్ధిచెంది డెంగీ, మలేరియా వ్యాధులు వ్యాప్తి చేస్తాయన్నారు.

అరుదైన శస్త్రచికిత్సలు



దుబ్బాక ఆసుపత్రి సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్, వైద్య సిబ్బంది

దుబ్బాక: దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రముఖ సర్జన్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ ఆధ్వర్యంలో రెండు అరుదైన ఆపరేషన్లు విజయవంతంగా చేశారు. దుబ్బాక మండలం ఎనగుర్తి గ్రామానికి చెందిన శర్వాణి ఎల్లయ్యకు పొట్ట పైభాగంలోఉన్న 14 కిలోల గడ్డను వైద్యులు విజయవంతంగా తొలగించారు. అలాగే దుబ్బాక మున్సిపాల్టీ పరిధి చెల్లాపూర్‌కు చెందిన దేవలక్ష్మీ తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతోంది. వైద్యులు పరీక్షించి కడుపులో గడ్డ ఉందని గుర్తించారు. ఆమెకు ఆపరేషన్ చేసి 5 కిలో గడ్డను తొలగించారు. ప్రస్తుతం వారిద్దరు ఆరోగ్యంగా ఉన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి

- శాస్త్రవేత్త డాక్టర్ సతీశ్‌కుమార్

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రత్యామ్నాయ పంటల సాగు విధానంపై రైతులు దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు డాక్టర్ సతీశ్ కుమార్, డాక్టర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. చిన్నకోడూరులోని రైతు వేదికలో శుక్రవారం రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో పొద్దు తిరుగుడు పంట సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తున్నారని, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నారన్నారు. ప్రత్యామ్నాయ పంటలైన పొద్దు తిరుగుడు, ఆముదం సాగు చేయాలని సూచించారు. పొద్దు తిరుగుడు అధిక దిగుబడినిచ్చే నూనె గింజల పంట అన్నారు. ఈ పంట అన్ని రకాల నేలలు, వాతావరణంలో పండించవచ్చన్నారు.



పిచికారీ పంపులను అందజేస్తున్న శాస్త్రవేత్తలు

పొద్దు తిరుగుడు సాగుపై రైతులకు క్షేత్రస్థాయిలో వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ చైర్మన్ వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, ఏఓ జయంత్ కుమార్, రైతులు పాల్గొన్నారు. అనంతరం ఎస్సీ రైతులకు ఉచితంగా పిచికారీ పంపులు అందజేశారు.

విద్యార్థి సంఘాల నాయకుల అరెస్ట్



రాజగోపాల్‌పేటలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు



కొమురవెల్లిలో..

నంగునూరు(సిద్దిపేట): హైదరాబాద్‌లో నిరసన తెలిపేందుకు వెళ్లకుండా ముందస్తుగా శుక్రవారం తెల్లవారు జామున బీఆర్ఎస్‌వీ నాయకులను రాజగోపాల్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. విషయం తెలుసుకున్న మండల నాయకుడు సోమిరెడ్డి రమేశ్‌గౌడ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విద్యార్థులకు సంఘీభావం తెలిపారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి(సిద్దిపేట): గ్రూప్1, గ్రూప్ 2 పోస్టులు పెంచి డీఎస్సీ వాయిదా వేసి, మెగా డీఎస్సీ ప్రకటన చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాలు శుక్రవారం కలెక్టరెట్ ముట్టడికి పిలుపు ఇచ్చారు. దీంతో పోలీసులు ముందస్తుగా విద్యార్థి సంఘం నాయకులను గురువారం అర్ధరాత్రి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

చిన్నకోడూరులో..

చిన్నకోడూరు(సిద్దిపేట): నిరుద్యోగుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ముట్టడికి పిలుపు ఇవ్వడంతదో ముందస్తుగా శుక్రవారం బీఆర్ఎస్వీ, బీజేవైఎం నాయకులను చిన్నకోడూరు పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

జగదేవ్‌పూర్‌లో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బీజేవైఎం రాష్ట్ర కమిటీ శుక్రవారం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపు నిచ్చింది. ముందస్తుగానే బీజేవైఎం నాయకులను జగదేవ్‌పూర్ పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

టీజీపీఎస్సీ ముట్టడిలో..

సిద్దిపేటరూరల్: టీజీపీఎస్సీ ముట్టడిలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి మాట్లాడుతూ విద్యార్థి సంఘాల నేతలను ముందస్తుగా అరెస్టులు చేయడం హేయమైన చర్య అన్నారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడి సందర్భంగా శుక్రవారం మండలంలోని తొమ్మిది మంది విద్యార్థులను ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

తొగుటలో..

తొగుట(దుబ్బాక): బీజేపీ మండల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమానికి వెళ్లకుండా శుక్రవారం వారిని అరెస్ట్ చేసి తొగుట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తుపై సాయంత్రి విడిచిపెట్టారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి(దుబ్బాక): టీజీపీఎస్సీ ముట్టడి సందర్భంగా మిరుదొడ్డి, అక్బర్‌పేట–భూంపల్లి పోలీసులు బీఆర్ఎస్‌వీ, బీజేవైఎం, బీజేపీ, విద్యార్థి సంఘాల నాయకులను శుక్రవారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

గజ్వేల్‌రూరల్: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న వారిని ముందస్తుగా అరెస్టు చేయడం సిగ్గుచేటని బీజేపీ, బీజేవైఎం నాయకులు ఆరోపించారు. చలో కలెక్టరేట్‌కు వెళ్లకుండా శుక్రవారం పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

మద్దూరులో..

మద్దూరు(హుస్నాబాద్): బీజేవైఎం, బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున ముందస్తుగా అరెస్ట్ చేశారు. కలెక్టరేట్ ముట్టడికి నిరుద్యోగ సంఘాలు పిలుపు ఇవ్వడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు క్షేమం

- మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రోత్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారన్నారు. గర్భిణులు పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, పాలు, మాంసం, చేపలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. వీటితో రక్తహీనత లేకుండా సుఖప్రసవం జరుగుతుందన్నారు. పిల్లలకు బాలామృతం ఇచ్చి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వాల సుప్రజ, అంగన్‌వాడీ టీచర్లు శ్రీమతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

లెనిన్‌నగర్‌లో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని లెనిన్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ అధికారులు గ్రోత్ మేళా నిర్వహించారు. శుక్రవారం సూపర్‌వైజర్ పావని ఆధ్వర్యంలో గ్రామంలోని 0 నుంచి 5 సంవత్సరాల పిల్లల శారీరక ఎదుగుదలను పరిశీలించారు. అనంతరం ఆమె పోషక లోపం ఉన్న పిల్లల తల్లుకు పోషకాహారం గురించి వివరించారు. తీవ్ర పోషక లోపం ఉన్న పిల్లలను ఎస్ఆర్‌సీకి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.



గుడ్లు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్ రజిత

గౌరారంలో..

వర్గల్(గజ్వేల్): మండలంలోని గౌరారంలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి పర్యవేక్షణలో గ్రోత్ మేళా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐదేళ్లలోపు చిన్నారుల బరువు, ఎత్తు కొలిచి నమోదు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రామలీల, సంతోష, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎన్ఎం మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేటజోన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రోత్ మేళా నిర్వహించారు. శుక్రవారం సిద్దిపేటలోని 9వ వార్డు అంగన్ వాడీ కేంద్రంలో మున్సిపల్ కౌన్సిలర్లు వరాల కవిత సురేష్, సతీష్ పిల్లల బరువు, ఎత్తును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ శ్యాంప్రసాద్ ముఖర్జీ జీవితం స్ఫూర్తి

దుబ్బాక: శ్యాంప్రసాద్ ముఖర్జీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశరక్షణ కోసం ముందుకు సాగుదామని బీజేపీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పార్టీ పిలుపు మేరకు శ్యాంప్రసాద్ ముఖర్జీని స్మరిస్తూ దుబ్బాకలోని 15వ వార్డులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపాల్టీ అధ్యక్షుడు కిష్టంగారి సుభాష్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో..

తొగుట(దుబ్బాక): బీజేపీ రాష్ట్ర కమిటీ పలుపు మేరకు శుక్రవారం కేజీబీవీలో ఆ పార్టీ నాయకులు మొక్కలు నాటారు. అనంతరం వెంకట్రావుపేట మాజీ ఎంపీటీసీ సభ్యుడు కంకణాల నర్సింహులు పదవీకాలం ముగియడంతో ఆయనను ఘనంగా సన్మానించారు.

◆ విద్యార్థులకు సన్మానం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన 15 మంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్ విద్యార్థులను బీఆర్ఎస్వీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్యాం యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే హరీశ్‌రావు మార్గదర్శకంలో సిద్దిపేట అన్ని రంగాల్లో ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

◆ 21 మంది విద్యార్థులకు ..

చిన్నకోడూరు(సిద్దిపేట): మనిషి జీవితాన్ని మార్చేది చదువు ఒక్కటేనని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కామిని శ్రీనివాస్, ఉన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మయ్య అన్నారు. 21 మంది చిన్నకోడూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వారిని శుక్రవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు గుజ్జ రాజు, నాయకులు శ్రావణ్, భానుచందర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులపై కోతుల దాడి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గోవర్ధనగిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఇద్దరు విద్యార్థులపై కోతులు దాడి చేయడంతో గాయపడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో కోతుల బెడద ఎక్కువగా ఉందన్నారు. పాఠశాల నుంచి బయటకు వచ్చే పిల్లలపై దాడి చేస్తున్నాయన్నారు. కోతుల నుంచి వారికి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

◆ సీఐని సస్పెండ్ చేయాలి

గజ్వేల్‌రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట దళిత ఎస్ఐ శ్రీరాములు శ్రీను పట్ల దురుసుగా ప్రవర్తించిన స్టేషన్ (ఎస్‌హెచ్‌ఓ) సీఐ జితేందర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తోటి సిబ్బంది ఎదుట అవమానపరచడంతో మనస్థాపానికి గురైన ఎస్ఐ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు.

◆ ధ్వజస్తంభాన్ని బాగు చేయాలి

సిద్దిపేటరూరల్: ఈదురు గాలులకు ధ్వంసమైన బుగ్గరాజేశ్వరస్వామి దేవాలయ ధ్వజ స్తంభాన్ని వెంటనే బాగు చేయాలని బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి రమేశ్‌గౌడ్ శుక్రవారం అన్నారు. రెండు నెలల క్రితం పడిపోయిన ధ్వజస్తంభాన్ని ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పొన్నాల బాబు పాల్గొన్నారు.

◆ ప్రభుత్వ పథకాలను అమలు చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ పథకాలను ప్రజాప్రతినిధులు అమలు చేయాల్సిందేనని, లేని పక్షంలో కౌన్సిలర్లు రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు పాల్గొనకపోవడం శోచనీయమన్నారు.

◆ నాయకుల అరెస్ట్ అక్రమం

సిద్దిపేట కమాన్: ప్రజాభవన్ ముట్టడికి బీఆర్ఎస్వీ పిలుపునిచ్చిన నేపథ్యంలో సిద్దిపేటలో ఆ నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన నాయకులను బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి పరామర్శించారు. అక్రమ అరెస్ట్‌లను ఖండిస్తున్నట్లు తెలిపారు.